క్లుప్తంగా

సాగునీరు అందించండి



మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణలు కోరారు. శుక్రవారం మండలంలోని నడిమివలసలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జి.సిగడాం మండలానికి తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా పంట పొలాలకు చుక్క నీరు కూడా రావడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ వచ్చి రెండు నెలలు పూర్తయినా ఇంతవరకు కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థులకు సూచనలిస్తున్న అధ్యాపకులు

జి.సిగడాం: స్థానిక బీసీ వసతి గృహంలో గురువారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. వసతి గృహం వార్డెన్ లోలుగు నూకరాజు అధ్వర్యంలో విద్యార్థులతో పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, వసతి గృహం సిబ్బందితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అంతర పంటలపై ఆసక్తి



కుప్పిలిలో పండిస్తున్న అంతర పంటలు

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎచ్చెర్ల గ్రామాల్లో రైతులు అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి, అరటి, మిరప, బెండ, మునగ వంటి పంటలు ఒకేచోట అంతర పంటలుగా వేస్తున్నారు. దీనివలన తక్కువ పెట్టుబడి, తక్కువ సాగునీటితో ఎక్కువ రకాల పంటలు చేతికి అందివస్తున్నాయని అంటున్నారు. అంతేకాకుండా ఒక పంట పోయినా మరోపంట బాగా పండుతుండడంతో నష్టాలు ఉండవని చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: ప్రకృతి వ్యవసాయానికి ప్రతీ రైతు మారాలని ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు అన్నారు. శుక్రవారం మండలంలోని వసుంధర గ్రామంలో మినీ కాసాన్ మేళా నిర్వహించారు. రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, ఏఓ దానకర్ణుడు, ఎంఈఓ దేవేంద్రరావు హాజరయ్యారు. రసాయన ఎరువులు వాడటం వలన భూసారం తగ్గుతుందన్నారు. ఆయా పంటలు తినడం వలన అనేక అనారోగ్యాలు వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ప్రకృతి ఎరువులను ఎలా వినియోగించాలో వివరించారు. సర్పంచ్ అప్పలనాయుడు, సలాన రాఘవరావు, ప్రకృతి వ్యవసాయం సభ్యులు పాల్గొన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



మార్కెట్ యార్డ్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఐటీడీఏ డీఈఈ శిమ్మయ్య, ఎంపీడీఓ చంద్రకుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మార్కెట్ యార్డుకు చేరుకుని, నిర్వహణ ఏర్పాట్లను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ అధికారులు, గిరిజన నాయకులు కృషి చేయాలన్నారు. ఉదయం 9 గంటలకు పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రధాన జాతీయ రహదారి మీదుగా మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామని గిరిజన నాయకులు తెలిపారు.

వామ్మో.. వయ్యారిభామ



ఏపుగా పెరిగిన వయ్యారిభామ

- మొక్కంతా విషమే
- పంటల్లో అంతర పంటగా ఎదుగుదల
- తగ్గిపోతున్న పంట దిగుబడి
- పశువులు, మనుషులకూ ప్రమాదమే

గార: పంటల్లో కలుపు మొక్క వయ్యారిభామ అంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు భయపడుతున్నారు. రోడ్ల పక్కన, కాలువ గట్లు, పొలం గట్లు, ఖాళీ ప్రదేశాల్లో పెరిగే ఈ కలుపు మొక్క పొలాల్లో పంటను మించి పెరిగిపోతుంది. ఈ కలుపు మొక్క పొలాల్లో త్వరితగతిన వ్యాపిస్తూ పంటల దిగుబడిని తగ్గిస్తుంది. అంతేకాకుండా జంతువులతో పాటు మానవులకు హాని చేస్తుంది. నిలువెల్లా విషం కలిగిన వయ్యారిభామ శాస్త్రీయ నామం పారినీయం హిస్టోరోఫోరెస్. ఈ మొక్క ఇంటి పరిసరాల్లో ఉంటే రోగాలు వెంటే ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

దిగుబడిని తగ్గిస్తుంది

వయ్యారిభామ పంట మొక్కల ఎదుగుదలను నియంత్రిస్తుంది. పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చివేస్తుంది. పూత, పిందె దశలో ప్రతాపం చూపి దిగుబడి తగ్గిస్తుంది. ఈ మొక్కలను తొలిదశలోనే నియంత్రించాలి. మొక్కజొన్న, పూల తోటలు, కూరగాయల పొలాలు, కొబ్బరి, మామిడి తోటల్లో ఏపుగా ఈ మొక్కలు పెరుగుతున్నాయి. ఫలితంగా రైతులకు దిగుబడి తగ్గుతోంది.

నివారణ చర్యలు

గ్రామాలు, పొలాల్లో ఉన్న వయ్యారిభామను పూత దశ రాకముందే వేర్లతో సహా తొలగించాలి. పూత దశకు రాకముందే 10 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయడం వలన ఈ మొక్కలు ఎదగవు.

నివారణ చర్యలు తీసుకోవాలి



వయ్యారిభామ మొక్కలు ఇటీవల కాలంలో పొలాలు, రోడ్ల వెంబడి ఏపుగా పెరుగుతున్నాయి. వీటివలన మనుషులకు, జంతువులకు ప్రమాదకరమే. దిగుబడి తగ్గడంలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. వీటి తొలి దశలోనే నివారణ చర్యలు తీసుకోవాలి. ఉప్పు ద్రావణం స్ప్రే చేయడం, కలుపు మందులు కొట్టడం వలన నివారించవచ్చు.

– డి.పద్మావతి, వ్యవసాయాధికారి, గార

మనుషులకూ ప్రమాదమే

మనుషులు ఈ మొక్క పుప్పొడిని పీలిస్తే జలుబు, కండ్లు ఎర్రబడడం, కనురెప్పలు వాపు వస్తాయి. వయ్యారిభామతో డర్మాటైటిస్, ఎగ్జిమా హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకై టీస్ వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. పువ్వుల నుంచి రేణువులు గాలిలో కలిసిపోవడంతో ఆ గాలి పీల్చడం ద్వారా ఊపిరితిత్తులు పాడవుతాయి. జంతువులకు వెంట్రుకలు ఊడిపోవడం, టెన్షన్ పెరగడం జరుగుతుంది. సాధారణంగా పశువులు ఈ మొక్కను తినవు. పొరపాటున గడ్డితో పాటు వయ్యారిభామను తిన్న పశువులు జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, శ్వాసక్రియలు దెబ్బతింటాయి. చివరకు మరణించే అవకాశాలు కూడా ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో ఉయ్యాలోత్సవం



ఉయ్యాలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని కోష్ఠ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ చైతన్య మఠం గోసేవా ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రాధాగోకులానంద స్వామివారికి శుక్రవారం ఉయ్యాలోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంధ్యాహారతి, పూలంగి సేవ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లైట్లు వెలగక ఇబ్బందులు



వాండ్రంగి వంతెనపై అలుముకున్న చీకటి

జి.సిగడాం: రాజాం – శ్రీకాకుళం ప్రధాన రహదారిలో వాండ్రంగి రైల్వే వంతెనపై రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు లేకపోవడంతో వంతెన మీద కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శ్రీకాకుళం కల్చరల్: బలగలో సామూహిక కుంకుమ పూజలు



ఎచ్చెర్ల: పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీ అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో...



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో వరలక్ష్మిగా లలితాదేవి

వరాలివ్వు తల్లీ.. వరలక్ష్మి...!

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ దేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వివిధ ఆలయాలకు మహిళలు చేరుకొని సామూహిక కుంకుమార్చనలు, వ్రతాలు ఆచరించారు. లక్ష్మీదేవి, అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే ఇళ్లల్లోనూ వరలక్ష్మి వ్రతాలను సంప్రదాయబద్ధంగా చేశారు. ప్రతి ఇంట లక్ష్మీదేవి ప్రతిమలను ప్రతిష్ఠించి, వాటికి వస్త్రాలు, పుష్పాలు, బంగారు నగలతో అలంకరించారు. వివిధ రకాల నైవేద్యాలు ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. ముత్తైదువులకు వాయినాలు అందించి ఆశీర్వచనాలు పొందారు.

-సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం కల్చరల్: కృష్ణార్జున మందిరంలో సామూహిక కుంకుమ పూజలు



శ్రీకాకుళం కల్చరల్: హరేరామ మందిరంలో...



శ్రీకాకుళం కల్చరల్: అసిరితల్లి అమ్మవారికి సారె సమర్పణ



గార: సామూహిక కుంకుమార్చనలో మహిళలు



జి.సిగడాం: పూజలందుకుంటున్న లక్ష్మీదేవి



గార: దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: లక్ష గాజుల అలంకరణలో బాల త్రిపుర సుందరి



శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



రణస్థలం: వల్లభరావుపేట దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కళతప్పిన మహిళా మార్ట్..!



మహిళా మార్ట్

- భారీగా తగ్గిన కొనుగోళ్లు
- కొందరు హోల్‌సేల్ వ్యాపారులకు బకాయి
- ఏడాదిగా జరగని ఆడిట్

శ్రీకాకుళం: మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది, వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకొల్పిన మహిళా మార్ట్ కళతప్పింది. శ్రీకాకుళం నగరంలోని రైతు బజార్ జంక్షన్‌లో ఉన్న మున్సిపల్ భవనంలో 2024లో దీనిని ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలందరి నుంచి రూ.150లు చొప్పున పెట్టుబడిగా పెట్టించి, వారందరినీ భాగస్వాములను చేసి మొత్తం రూ.30 లక్షలతో మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో నిత్యం డ్వాక్రా సంఘ సభ్యులతో పాటు ఇతరులు సైతం ఎక్కువగా కొనుగోళ్లు చేయడంతో ప్రతిరోజూ రూ.80,000 నుంచి రూ.90,000లు వరకు లావాదేవీలు జరిగేవి. మున్సిపల్ భవనానికి అద్దె లేకపోవడంతో, మార్ట్ నుంచి కరెంటు బిల్లులు కూడా వసూలు చేయకపోవడంతో మార్టులో ఉన్న ఉద్యోగులకు నెలకు దాదాపు రూ.26 వేల వరకు జీతాలు చెల్లించేవారు. ఇలా సక్రమంగా వ్యాపారం జరగడంతో భాగస్వాములైన మహిళలకు రూ.10 లక్షల వరకు తిరిగి చెల్లించేశారు.

ప్రభుత్వం మారడంతో...

ప్రభుత్వం మారిన తర్వాత వేరొక యాజమాన్యం రావడం, కొద్ది నెలల తర్వాత వారు కూడా వెళ్లిపోవడంతో ప్రస్తుతం మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి నేతృత్వంలో మార్ట్ కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం కొనుగోళ్లు తగ్గడంతో రోజుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు మాత్రమే వ్యాపారం జరుగుతోంది. లావాదేవీలు తగ్గడం వలన సరుకులు కూడా పూర్తిస్థాయిలో మార్టులో ఉంచలేకపోవడం కూడా కొనుగోళ్లు తగ్గడానికి ఓ కారణంగా తెలుస్తోంది. అలాగే గత ప్రభుత్వ హయాంలో మార్ట్ నెలకొల్పడంతో కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా ఏడాది నుంచి ఆడిట్ కూడా జరగడం లేదు. మార్ట్‌లో కొంత మొత్తం గోల్‌మాల్ అయిందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఏడాదిగా ఆడిట్ కూడా చేయకపోవడంతో ఇటువంటి ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఇదిలా ఉండగా హోల్‌సేల్ వ్యాపారులకు కూడా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. అందువలన అధికారులు ఆడిట్ చేపట్టి మార్ట్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లావాదేవీలు తగ్గాయి



మార్టులో లావాదేవీలు తగ్గడం వల్ల లాభాలు లేకపోయినా.. నష్టాలు మాత్రం లేవు. హోల్‌సేల్ వ్యాపారికి బకాయిలపై లెక్కలు తేల్చేందుకు తమకంటే ముందున్న ముగ్గురు మహిళలు రావాల్సి ఉంది. వారిని ఎన్నిసార్లు పిలిచినా రావడం లేదు.

– నాగలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

మంచినీటి కల్పనకు ప్రాధాన్యం



మోటారు బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కవిటి ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. లండారపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగలో రూ.1.50 లక్షల మండల పరిషత్ నిధులతో వేసిన విద్యుత్ మోటార్ బోరు బావిని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్ పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పలాస: ఆవాజ్‌యోజన్ పథకం కింద మంజూరైన ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోగా పూర్తి చేయాలని సోషల్ డలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్లకు సంబంధించి ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ప్రభుత్వం అదనంగా అందజేస్తోందన్నారు.